అసలు తల ఎగిరి పోవలసింది. కాని కొంచెంలో తప్పిపోయింది. 100 యార్డ్స్ డాష్ కాలేజీలో ప్రాక్టీసు చేస్తుంటే, ఓసారి గోతిలో పడిపోయాను. ఆరోజులే వేరులెండి. ఇలా ప్రారంభించి తను ఎలా కాలేజీలోకల్లా వీరుడయిందీ ఎలా ప్రైజులన్నీ కొట్టేసిందీ, ధైర్యం సాహసం శరీరబలం యివన్నీ పెంపొందించుకుంటూ ఎలా ఊరునీ కాలేజీనీ గడగడ లాడించిందీ— ఉదాహరణలతో సహా వివరిస్తాడు. అతనలా మాటాడుతున్నంతసేపూ, మనం అతని స్థూలకాయం వేపూ లోతుగాపోయి చుట్టూ నల్లగుంటలుపడ్డ కళ్లవేపు చూస్తూ కూర్చోవాలి.

మహానగరంలో వడీ వేగం యీ రెండిటితో జీవిస్తూంటే, అప్పుడప్పుడూ వార్తా పత్రికా కార్యాలయాల ముందు గుంపులుగా నిలబడి జనం ఏక్కడో జరుగుతున్న మ్యాచ్ తాలూకు స్కోర్ ప్రకటించే బోర్డువేపు చూస్తూంటారు. క్షణ క్షణం ఎవరెన్ని పరుగులు తీశారో తాజాగా ఆ బోర్డు మనకి అందిస్తుంది. ఆ జనానీకంలో ఎంతమంది విఫలులయిన జగజ్జెట్టీలున్నారో అనిపిస్తుంది. ఆ ఘడియల్లోనే నాకు మా ఆదినారాయణ మేస్టారు జ్ఞాపకం వస్తారు. పరిగి పళ్ళకి అడివికి వెడితే, అక్కడ పిగిలిపిట్టల్ని, అడివి రామచిలకల్ని చూసి మరీ రమ్మనేవాడు. గోదావరి గట్టున చెడుగుడు ఆట మధ్యలో అవి ఆకాశంలో ఎగిరే కొంగల బారుల్ని చూడమనేవాడు. ఇప్పుడాయన నాతోపాటు పట్నంలో ఉంటే యీ భారీ పరిశ్రమల ఆటల గురించి ఆయన్ని అడగాలని ఉంది. కాని ఆయన ఎక్కడున్నాడో! ఏ కొంగల బారుని చూస్తూ ఎక్కడున్నాడో!

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)

# కల్పనల అల్లిక

దండమూడి మహీధరకుమార్

ప్రియమైన అక్కకు,

నీ ప్రియమైన చెల్లి అభివాదాలు. నేనీ లేఖను చాలా కాలం గడిచినతర్వాత రాసేందుకు కూచున్నాను. నీనుంచి లేఖ వస్తుందని ఎన్నో రోజులు నిరీక్షించాను. కాని నేను రాసిన లేఖలు అందలేదేమోనని నాకు నేను పూరడించుకొని వూరుకున్నాను.

నీవు నాకు అక్కవై వుండికూడా చాలా దూరంగా వుండిపోయావు. నా అంతర్యానికి దూరమైన చందంగా - నిన్ను కలుసునునేందుకైనా వీల్లేకుండా బాహ్యంగాకూడా వందల మైళ్ళదూరంలో వున్నావు. నీకోసం ఎందరెందరికో ఉత్తరాలు రాశాను. చాలా కాలానికిగాను పూర్ణ దగ్గర్నుంచి నిన్ననే ఒకలేఖ వచ్చింది. దాంట్లో పూర్ణ, నువ్వు ఇటీవలే "మోరిస్ స్ట్రీట్" నుంచి మారి మహారాణీపేట 'భక్తిభవన్'లో వుంటున్నావని-తెలిపింది. ఆ వుత్తరంలో ఇంకా నిన్నుగురించిన విషయాలు చాలా రాసింది. అవి చదువుకొని అమితంగా విచారించాను.

చాలాసార్లు నువ్వు నాకు లేఖలు రాయనందుకు బాధపడ్డాను, గంటలకొలది ఏకాంతంలో కూచొని ఏడ్చాను. నాకు నేనే సాంత్వన వచనాల్ని చెప్పుకొని, నా అంతర్యాన్ని దిట్టపరుచుకునేదాన్ని! కాని ఏం చేసినా నీరూపు నా హృదయఫలకం మీద కన్పించి నాలో వేదనను రేపేది! దుఃఖాన్ని కల్పించేది! దీనికంతటికీ కారణం-నీవు నా పెళ్ళికి ముందు చెబుతూండే విషయాలవల్లనే నేమో? 'నేను పెళ్ళే మానుకుంటా' నంటే 'పిచ్చి హైమా! ఇలాంటి ఆలోచనలతో బుర్ర పాడు చేసుకోక, చదువుకో! పెళ్లనేది ఋతుధర్మంలో పుష్పించే కుసుమం లాంటిది, దీన్నిగూర్చి ఆలోచించిన కొద్దీ మనిషి చెడిపోవటమేగాని ఒక సవ్యమైన మార్గం బోధపడనే పడదు—'అని నీవన్న కొద్ది కాలానికే నా పెళ్ళి మధుతో కావటం ఒక చిత్రమైన సంఘటన! 'నేను పెళ్ళి చేసుకోను' అని అన్నప్పుడు నాలో ఎలాంటి భావాలున్నాయో తెలీదుగాని, ఈనాడు నా పెళ్ళయి వాస్తవిక జీవితంలోకి అడుగిడి నేచూచిన పరిస్థితుల్ని

అర్థం చేసుకున్నాక ఆనాడు నేను తీర్మానించుకున్న దానిమీద నిలబడి వున్నట్లయితే ఎంతో బావుండి వుండేదని ప్రతి నిమిషమూ అనుకుంటాను. కాని అలా జరగలేదు. ఇప్పుడు నేను ఒక వ్యక్తికి భార్యను. ఆ భర్తను నేను కష్టాల్లో, సుఖాల్లో జీవితంలో ఎదురయ్యే ప్రతీ విషయంలోనూ- కనిపెట్టుకొనివుంటూ ఈ జీవితాన్ని అంతం చేసుకోవాల్సిందే! ఈవాక్యాల్ని చదువుకొని నువ్వు మధును శంకెంచాల్సిన పనిలేదు. ఇది నన్ను గురించిన విషయం. ఒక స్త్రీ కల్పనల అల్లికలోని ఒక భాగం!

* * *

మధుకు మద్రాస్‌లో ఉద్యోగం కావటంతో నేనూ వచ్చాను. కాని మధు సంపాయించే జీతం మా ఇద్దరికీ సరిపోయేదికాదు! నన్ను పువ్వుల్లో పెట్టి పూజించేవాడు. నాకోసం ఏవేవో తీసుకొచ్చేవాడు. నా మొహంమీద ఎల్లవేళలా నవ్వు ప్రభవిస్తే చూడాలని ఎదురు చూచేవాడు కాలాంతరానికి నేను నవ్వలేకపోయాను. నాకోసం మధు తన అవసరాల్ని సంపూర్ణంగా తగ్గించుకొని నా మొహంలో నవ్వు సృష్టించేందుకు తాను పడ్డ బాధల్ని చూచి నేను ఏడ్చాను. నా ఏడ్పుకు ఆయన హడలిపోయి "ఎందుకు హైమా ఏడుపు? నీకు నేనేమిలోటును కలిగించాను? నావల్ల ఏదైనా పొరపాటు జరిగితే చెప్పు", అన్నాడు-ఓరోజున. ఆ నిమిషంలో నేను చదువు ఆపకుండా పూర్తి చేసినట్లయితే ఈనాటికి పాలకు నీళ్లు తోడైనట్లు మధుకు చేదోడు వాదోడుగా వుండి నేనూ కొంత సంపాయించేదాన్ని, అని విచారించి- "నాకోసం మీరు ప్రతినెలా ఎలాంటి వస్తువులూ కొనవద్దు, నన్ను సంతోషపెట్టాలనే ప్రయత్నంలో మిమ్మల్ని మీరు హోమం చేసుకోవద్దు"- అన్నాను. మధు మాట్లాడలేదు. చాలీచాలని జీతం సంపాయిస్తూ, కోరికల్ని అణుచుకుంటూ, జీవితావసరాల్ని క్లుప్తీకరించుకుంటున్న మధు మాట్లాడక పోవటంలో అర్థం వుంది.

ఆ తరువాత మధు ఓరోజు- "ఏం జీవితం ఇది?" అని తను ఎదుర్కొంటున్న కష్టాల్ని గూర్చి చెప్పిన మాటలు- డబ్బుకు బాధపడుతున్నా బాధపడనట్టే నటిస్తూ, హృదయపు అట్టడుగున అసంతృప్తి కరుడుగట్టుకొనివుండగా సంతృప్తిగా జీవిస్తున్నట్టే కనబడుతూ చెబుతూండే వెనుకటి మాటలకంటే- ఇవే నాకు హాయిని చేకూర్చాయి. తన హృదయాంతరాళాగాన్ని ఇలా మట్టూ మర్మంలేకుండా నాకు తెలియచెప్పినప్పుడు నేను సంతోషపడి నవ్వేను. అదే మొదటిసారీ, ఆఖరిసారి కూడాను.

ఆశ, నిరాశ మధ్య కొట్టుమిట్టు లాడుతున్న నాకు నాన్నా అమ్మా చాలామార్లు గుర్తుకొచ్చారు. కాని మధును పెళ్ళి చేసుకోవడంవల్ల వాళ్లకు దూరమైపోయాను. నీవైనా నాకు వెనుకటిలా నా జీవితానికి వెలుగు చూపుతావని ఆశించాను. కాని నువ్వుకూడా వాళ్ళలో జతయ్యావు. మన చిన్ననాటిసంగతి గుర్తుకు తెచ్చుకుంటేనే నాశరీరం మొగ్గలు తొడుగుతుంది. గంట క్రితమే నీవు నాతో మాట్లాడి వెళ్ళినట్లుగా భాసిస్తుంది. ఒక్కసారి గతమంతా నా ముందు తారట్లాడుతుంది. కాని మరోనిమిషంలో - స్ఫురిస్తుంది చాలామంది నాకు దూరమయ్యారు! నన్ను నవ్వుతూ పల్కరించిన వాళ్ళే నన్ను దూరం చేశారు. ప్రతినిత్యం నీకు సాయంగా వుండి నీ జీవితంలో మధురిమను/ఒలక బోసేందుకు సంసిద్ధం అని వాగ్దానం చేసిన వ్యక్తులు నేను కష్టాల్లో బాధల్లో కృంగి కృశించి పోతున్నానని తెలుసుకొని కూడా తెలుసుకోనట్లుగా వుండటం నాకు బాధాకరంగావుండి నా హృదయాన్ని వెయ్యి రంపాలతో కోస్తోంది.

నేను నా జీవిత చిత్రాన్ని నీకు వినా ఎవరికీ చూపించలేను. ప్రతి నిమిషం గతం నా ఎదుట మెదిలి ఎన్నో అర్థాల్ని నిర్వచిస్తోంది. శాంతీ, సుఖమూ తృప్తీ లేని ప్రస్తుత జీవితం మీద రోత పుడుతోంది. మధులాగా ఎంతమంది భర్తలు ఇలా అంతులేని అవాంతరాల మధ్య జీవిస్తూ వాస్తవిక మనోగత భావాల్లో న్యూనతను సృష్టించుకుంటున్నారో?

నాకు మార్గాన్ని బోధిస్తావనే ఆశతోలేఖ ఈ లేఖను నీకు పంపుకుంటున్నా. దీనికైనా సమాధానమిచ్చి నా జీవితంలో కాంతిపుంజాల్ని వెదజల్ల గలవని ఆశిస్తున్నా.

నీ ప్రియ చెల్లి హైమా.